# కథ

# నువ్వెక్కడ?

-మధురాంతకం నాగభూషణమ్మ



"అమ్మా వసుధా, నేను బయలుదేరుతానమ్మా" ఆటో ఎక్కుతూ కూతురితో చెప్పింది జానకమ్మ. ఆమె వసుధ దగ్గరికి వచ్చి రెండు నెలలయింది.

"అలాగేనమ్మా, జాగ్రత్తగా వెళ్ళు. అన్నను, వదినను, పిల్లలను అడిగానని చెప్పు. వెళతానే నాకు ఫోన్ చెయ్యి" చేతిలో పనితోనే తల్లికి జవాబు చెప్పింది వసుధ.

"అమ్మా వసుధా, ఫోను కింద ఉత్తరం ఉంది. తీరిక దొరికినపుడు చదువుకో. వెళ్ళొస్తాను" అంది జానకమ్మ.

"అలాగే, నువ్వు జాగ్రత్త" చెబుతూ వర్ష స్కూలు బస్సు రావడంతో లంచ్ బేగు, పుస్తకాల సంచితో ఇంటి ముందుకు వచ్చింది వసుధ.

వసుధ కూతురిని బస్సు ఎక్కించి, మురళికి కూడా ఆటో రావడంతో వాడిని కూడా స్కూలుకు పంపించి, తన లంచ్ బ్యాగు, పుస్తకాలు, ప్రోగ్రెసు కార్డులు వున్న సంచినీ బండికి తగిలించి, ఇంటికి తాళం వేసి, ఒకటి రెండుసార్లు లాగి చూచి స్కూటర్ స్టార్టు చేసింది. అక్కడికి వసుధ పని చేసే స్కూలు మూడు కిలోమీటర్లు ఉంటుంది.

చేతి వాచిలో టైమ్ చూసుకుంది. ఎనిమిదిన్నర కావస్తూ ఉంది. 'పరవాలేదు. వేళ మించకుండా బడికి చేరుకోవచ్చు' అనుకుంటూ స్కూటర్‌లో బయలుదేరింది. అలా ఒక కిలోమీటరు దూరం వెళ్లిందో లేదో స్కూటర్ ఆగిపోయింది. అందులో పెట్రోలు అయిపోయింది. ఏం చేయడానికి తోచక చుట్టుపక్కలా చూసింది వసుధ. ఎక్కడా పెట్రోలు బంకు కనిపించలేదు. ఒక కిలోమీటరు వెళితే గానీ పెట్రోలు బంకు రాదు. ఏం చేయాలో అర్థం కాక అయిదు నిముషాలు అలాగే ఉండిపోయింది. "సుధా, బండి రిజర్వులో ఉంది. పెట్రోలు అయిపోతే, డిక్కిలో బాటిల్లో పోసి ఉంచాను. పోసుకో" అని ఆ రోజు తెల్లవారి తనతో భర్త అన్నమాటలు వసుధకు తటాలున గుర్తుకు వచ్చాయి.

బ్రతుకు జీవుడా అనుకుని, పెట్రోలు పోసుకుని తొందర తొందరగా బడికి బయలుదేరింది. బడిలో అడుగు పెట్టేప్పటికి సమయం తొమ్మిది పదినిముషాలు. ఆదరాబాదరా టీచర్సు రూముకు వెళ్ళి సంతకం చేసి క్లాసుకు వచ్చింది. ఆ రోజు పదవతరగతికి సోషియల్ స్టడీసు చెప్పాలి. తాను చదువుకున్నది అడ్వాన్సు తెలుగు బి.ఏ. చెప్పవలసింది ఇంగ్లీషులో. రాత్రంతా కూర్చుని చదివి తయారయిన విషయాన్ని చెప్పడానికి ప్రారంభించింది. ఇంతలో ప్యూను రంగయ్య వచ్చి "అమ్మా, మిమ్మల్ని పెద్ద మేడం గారు పిలుస్తున్నారు" అన్నాడు.

ఆమే హెడ్‌మిస్ట్రెస్. రంగయ్యతోపాటు ఆమె రూముకు వెళ్లింది వసుధ.

వసుధను చూడగానే "ఏమ్మా వసుధా.. నైన్తు క్లాసు వాళ్లకు ఇంకా మంత్లీ టెస్టు పెట్టలేదు. సెవన్తు వాళ్లకు ప్రోగ్రెసు కార్డులు ఇవ్వలేదు. మీలాంటి వాళ్ళకెందుకమ్మా వుద్యోగాలు. ఎప్పుడూ భర్త, ఇల్లు, పిల్లలు ఇదే మీ ధ్యాసంతా. ఇంక స్కూలు పనులెలా జరుగుతాయి చెప్పండి. ఏమన్నా అంటే హెడ్‌మిస్ట్రెస్ రాకాసి, అరుస్తుంది అని నాకు పేరు. అడిగిన దానికి జవాబు చెప్పాలని కూడా మీకు తోచదు" అంది.

"అలాగే మేడం. రేపు నైన్త్ క్లాస్ వాళ్ళకు మంత్లీ టెస్ట్ పెడతాను, సెకండ్ పీరియడ్లో సెవెంత్ క్లాస్ వాళ్ళకు ప్రోగ్రెస్ కార్డులు ఇస్తాను" అంది వసుధ.

"చెబితే గానీ పనులు చేయరు. సరిసరి. క్లాసుకు వెళ్ళు. పిల్లలు అల్లరి చేస్తుంటారు" అంది హెడ్ మిస్ట్రెస్సు.

సరేనంటూ క్లాసుకు వచ్చింది వసుధ.

ఎలాగయితేనేం లంచిబెల్లు మ్రోగడంతో పిల్లలు, వసుధ క్లాసునుంచి బయటపడ్డారు.

టీచర్సు రూములో టీచర్సందరూ భోజనాలు చేయడానికి కూర్చున్నారు. తెల్లవారి తల్లి ప్రయాణ హడావుడిలో కూర ఏమీ చేయలేదు. పెరుగన్నం మాత్రం తెచ్చుకుంది వసుధ. ఇంతలో తనతో పని చేసే సుశీల "ఏంటి సుధా, హైకమాండునుంచి పిలుపు వచ్చినట్టుంది. ఏంటి విషయం" అంది.

"ఆఁ ఏముంది, రాత్రి మేడంగారికి వాళ్లాయన చేత పుష్పాభిషేకం జరిగి ఉంటుంది. వాటిని మనపై కొన్నింటిని చల్లితే కానీ ఆమెకు శాంతి కలగదు" అంటూ నవ్వింది వసుధ.


కబుర్లతో లంచవరు ముగిసింది. 'బయలుదేరుదాం. మళ్ళీ బాసు రాగలదు' అంటూ అందరూ ఎవరి క్లాసుకు వారు వెళ్లారు.

వసుధ ఏ పని చేస్తున్నా తెల్లవారి నుంచి 'తల్లి ఉత్తరంలో ఏమి రాసి ఉంటుంది' అన్న ఆలోచన మెదడులో మెదులుతూనే ఉంది. లాంగు బెల్లు మోగడంతో పిల్లలు, వసుధ స్కూలు నుంచి బయటకు వచ్చారు.

ఆకాశం మేఘావృతమై ఉంది. ఒక్కొక్క చినుకు పడటం మొదలయింది.

''వర్షం బలంగా వచ్చేట్టుంది. త్వరగా బయలుదేరుదాం వసుధా'' అంటూ శ్యామల కూడా వచ్చింది.

వాళ్లు ఒక కిలోమీటరు వెళ్లేప్పటికి వర్షం ఎక్కువయింది. డిక్కీలో రెయిన్ కోటు కూడా లేదు. తనకెట్లన్నా కానీ, పిల్లల బ్యాగుల్లో కూడా రెయిన్ కోట్లు పెట్టలేదు. వసుధకు కంగారు ఎక్కువయింది. మరో కిలోమీటరు దూరం వెళ్ళేప్పటికి వాతావరణం మరీ దారుణంగా మారింది. మేఘాలు దట్టంగా కమ్ముకోవడం వలన రాత్రిని తలపిస్తోంది. బస్‌స్టాప్ వద్ద ఆగింది వసుధ. అక్కడ షెల్టర్‌లో ఓ మూల ఒక ముసలమ్మ గంప పెట్టుకుని కూర్చుని ఉంది. నలుగురు మగమహారాజులు చలికి వెచ్చగా సిగరెట్లు కాలుస్తూ నిల్చుని, రాజకీయాలు మాట్లాడుతున్నారు. వాళ్ళ చూపులు తన తడిచిన శరీరాన్ని తాకుతూ ఉన్నాయి. ఆ చూపులకన్నా వానలో తడవడమే మేలని బండిని కదిలించింది వసుధ. అన్నిటికంటే పిల్లలేమయినారో అని కంగారు ఎక్కువగా ఉంది. 'అసలే మురళికి జలుబు, దగ్గు ఉంది. వర్షంలే తడిస్తే ఇంకేమయినా ఉందా' ఎలాగో వర్షాన్ని ఎదురీదుతూ ఇల్లు చేరింది. గబగబా మెట్లెక్కుతూ బాల్కనీలోకి తొంగి చూసింది. పిల్లలిద్దరూ వానలో తడిసి, చలికి గజగజ వణకుతున్నారు. వెంటనే వాళ్ళ తడిబట్టలు తీసి, పొడి బట్టలు వేసి, తలలు తుడిసి, సాంబ్రాణి పొగ వేసింది. తాను



కూడా పొడి బట్టలు కట్టుకుంది. పాలు కాచి హార్లిక్సు వేసి పిల్లలతో తాగించింది. తాను కాఫీ పెట్టుకుని తాగి, భర్తకు ఫ్లాస్కులో పోసి ఉంచింది.

ఇంతలో శివరావు ఆఫీసునుంచి వచ్చాడు. రావడంతోనే ''సుధా, పిల్లలు వర్షంలో తడిసారా?'' అనడిగాడు. ''అయినా, నీ కెన్ని సార్లు చెప్పాను పిల్లల బ్యాగుల్లో రెయిన్ కోట్లు వుంచమని. నీకెక్కడ తీరిక వుంటుంది. ఎంత సేపు స్కూలు, పరీక్షలు, ప్రోగ్రెస్సు కార్డులు, ఇండిపెండెంటు రోజు మీటింగులో మాట్లాడవలసిన దానికి వ్యాసాలు.. దీనితోనే సరిపోతుంది. ఇంక మొగుడు, ఇల్లు, పిల్లలు వున్నారన్న విషయం గుర్తుండదు. రేప్పొద్దున వాళ్లకు జ్వరం వస్తే అవస్థ పడవలసిన వాణ్ణి నేను. ఏమన్నా అంటే పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. పోర్షను ఇంకా పూర్తి కాలేదు. మేడం శలవు ఇవ్వదు అంటావు. నేనెంత అరిస్తే మాత్రం ఏమి ప్రయోజనం? ఏముంది నీ దగ్గర జవాబు, నా కంఠశోష తప్పితే'' విసుక్కున్నాడు శివరావు.

వసుధను ఈ మాటలేవీ కదిలించలేదు. ఆమె ధ్యాసంతా తల్లి ఉత్తరం మీదే ఉంది.

పిల్లలచేత హోంవర్కు చేయిస్తూనే వంట ముగించింది. పిల్లలకు, భర్తకు పెట్టి తాను కూడా తిని, వంటిల్లు సర్దేప్పటికి రాత్రి తొమ్మిదిన్నర అయింది.

అప్పటికి తండ్రీబిడ్డలు మంచాలెక్కేశారు. తనకు గూడా నిద్ర వస్తూ ఉంది. కానీ తల్లి ఉత్తరం చదవాలి కదా. ఉత్తరం తీసుకుని వాళ్లకు నిద్రాభంగం కాకుండా హాల్లోకి వచ్చి సోఫాలో కూచుంది.

''అమ్మా సుధా..

ఇద్దరు మొగపిల్లల తరువాత పుట్టావని నిన్ను వున్నంతలో మురిపెంగానే పెంచాము. బి.ఏ., బి.ఇ.డి చేయించాము. మంచి కట్నమిచ్చి పెండ్లి చేశాము. ఉన్నది ఒక పిల్ల, అంత దూరంలో ఇవ్వడం అవసరమా అని మీ చిన్నన్నకు ఇష్టం లేదు. కానీ నిన్ను ఒక ఆఫీసరు భార్యగా చూడాలని మీ పెద్దన్న అభిమతం. అందువలన మనకంటే పెద్ద సంబంధం అయినా నిన్నిచ్చి చేశాము. కట్నానికి వెనుకాడలేదు. ఇచ్చి చేసినందుకు మేమెప్పుడు బాధపడలేదు. అబ్బాయి మంచివాడు. నిన్ను బాగా చూసుకుంటాడు అనుకున్నాము. మీనాన్నగారి పనులన్నీ పొరుగు రాష్ట్రంలోనే ఉన్నందు వలన వారిని వదిలి ఇన్ని రోజులు నీ దగ్గరికి రావడం కుదరలేదు. కానీ నిన్ను తలుచుకున్నప్పుడు నాకున్న అభిప్రాయం ఏమంటే 'అల్లుడు మంచివాడు. పెద్ద ఆఫీసరు. అమ్మాయి కూడా ఉద్యోగం చేస్తూ ఉంది. చేతినిండా డబ్బులు. లాకర్లో కావలసిన నగలు. ఇంట్లో పని చేయడానికి పనిమనిషి. కాలు బైట పెడ్తే కారు. పిల్లలు ముత్యాల్లాంటివారు. ఇంక వాళ్ళ చదువు విషయానికొస్తే వర్ష తన క్లాసులో తానే ఫస్టు. మురళి కూడా బాగా చదువుతాడు. మా కూతురు చాలా అదృష్టవంతురాలు' అనుకునేవాళ్ళం.

'నాన్న ఉన్నన్ని రోజులు నీకు రావడానికి కుదరలేదు. ఇప్పుడన్నా రామ్మా నా దగ్గర ఉందువుగాని' అని నీవు పిలవడంతో వచ్చి రెండు నెలలకు పైగా నీ దగ్గరున్నాను.

ఈ రెండు నెలల్లో పట్టుమని పదినిముషాలు నాతో మాట్లాడటానికి నీకు తీరిక దొరకలేదు. ఎపుడు పిలిచినా 'వర్షకు జడవేస్తున్నాను, మురళికి స్నానం చేయిస్తూ వున్నాను. ఆఫీసుకు వారు బయలు దేరుతున్నారు. లంచు బేగు ఇవ్వాలి'. ఇవి కాకుంటే 'అమ్మా రేపు తెలుగు సమితిలో మాట్లాడాలి. వ్యాసం రాసుకొంటున్నాను.' ఇదీ నీ వాలకం.

నిన్ను చూస్తే నాకు నా కూతురు కనిపించడం లేదు. ఒక వాషింగు మిషను, ఒక గ్రైండరు, ఒక మిక్సీ మాత్రమే కనిపిస్తు ఉంది. పెండ్లికాక ముందు నీలో వున్న ఉత్సాహమెక్కడ? హాస్యమెక్కడ? సంతోషమెక్కడ? ఆర్ద్రత ఎక్కడ? చిలిపితనం ఎక్కడ? అసలు నువ్వెక్కడ?'

తల్లి ఉత్తరం చదువుకొన్న వసుధ కనులు మూసుకుని సోఫాలో వాలిపోయింది.

*

రచయిత చిరునామా
మధురాంతకం నాగభూషణమ్మ
దామలచెరువు, చిత్తూరు జిల్లా
సెల్ : 9885769779